సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం | 9 | జూలై | 2025



ఎస్‌బీఐ ఏటీఎం దగ్ధం

యానాం పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఏటీఎం కాలిపోయిన ఘటనలో సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం సంభవించింది.

-8లో...



రక్కసీ కోత

ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాలు ఒక్కసారిగా ఉప్పొంగుతూంటాయి. దీంతో తీరం వెంబడి భూమి మీటర్ల మేర కోతకు గురవుతోంది.

-8లో...

కడలిలోకి 1.98 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి ఉధృతి మంగళవారం స్వల్పంగా పెరిగింది. బ్యారేజీ నుంచి 1,98,710 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,450, పశ్చిమ డెల్టాకు 6,500 కలిపి మొత్తం 13,550 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.80 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

జిల్లాలో ఆరు అడ్వెంచర్ టూరిజం పాయింట్లు



టూరిజం ఏజెన్సీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా జిల్లాలోని గోదావరి తీరం వెంబడి ఆరు అడ్వెంచర్ టూరిజం పాయింట్ల అభివృద్ధికి టెండర్లు పిలిచినట్టు కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లో పర్యాటక రంగ అడ్వెంచర్ టూరిజం ఏజెన్సీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, టెండర్ ప్రతిపాదనలపై సమీక్షించారు. దిండిలో మూడు పాయింట్లు, దిండి – అంతర్వేది మధ్య ఒక పాయింటు, అంతర్వేదిలో ఒక పాయింటు, ఆత్రేయపురంలో మరో పాయింటును ఎంపిక చేశామన్నారు. ఈ పాయింట్లలో వాటర్ యాక్టివిటీ అడ్వెంచర్ కార్యక్రమాల విధివిధానాలపై సమగ్ర ప్రతిపాదనల అంచనా వ్యయాలతో నివేదిక రూపొందించుకుని ఈ నెల 15వ తేదీన హాజరు కావాలని ఏజెన్సీలను ఆదేశించారు.

- జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్ సమావేశాలను విజయవంతం చేయాలని ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాల యాజమాన్యాలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఈ మేరకు సమావేశం నిర్వహించారు. పక్కా ప్రణాళికతో పీటీఎం నిర్వహించి, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించడంలో భాగస్వామ్యం వహించాలని స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకం, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, పాజిటివ్ పేరెంట్ మీటింగ్, మనబడి మేగజైన్ తదితరాంశాలపై అవగాహన కల్పించాలన్నారు.

సంతృప్తికరంగా సేవలు

అమలాపురం రూరల్: పౌరులకు సంతృప్తికరంగా ప్రభుత్వ సేవలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి భూపరిపాలన ముఖ్య కమిషనర్ జయలక్ష్మి, కార్యదర్శి ఎస్.ప్రభాకర్ రెడ్డి అమరావతి నుంచి మంగళవారం వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందరికీ ఇల్లు, భూముల క్రమబద్ధీకరణ, గృహాల మంజూరు, కుల ధ్రువీకరణ పత్రాలు, ప్రజాసమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీల పురోగతిపై సమీక్షించారు. అనంతరం జిల్లా అధికారులతో జేసీ మాట్లాడారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజల సంతృప్తి స్థాయిలను మెరుగుపరచాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

వాసవీ మాతకు ఆషాఢం సారె



అమ్మవారికి సమర్పించిన ఆషాఢం సారె

అమలాపురం టౌన్: ఆషాఢమాసంలో మంగళవారం సందర్భంగా అమలాపురంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని శాకంబరీ దేవిగా పలు రకాల కూరగాయలతో అలంకరించారు. అలాగే అమ్మవారికి పట్టణ ఆర్యవైశ్య మహిళలు ఆషాఢం సారెను సమర్పించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. ముందుగా గడియారం స్తంభం సెంటర్ నుంచి మహిళలు సారెతో వాసవీ మాత ఆలయం వరకూ శోభాయాత్ర (పాదయాత్ర) నిర్వహించారు. ఆర్య వైశ్య మహా సభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి, యెండూరి రాఘవ, పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, సంఘం ముఖ్య సలహాదారు వరదా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్





వైఎస్సార్ జయంతి సందర్భంగా రావులపాలెంలో రైతులను సత్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి. చిత్రంలో అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి

ఊరూరా.. మనసారా..



మలికిపురం మండలం శివకోడులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాజోలు నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు



పి.గన్నవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం వేడుకలు జరుపుకొంటున్న కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, రాజేశ్వరీదేవి

- ఘనంగా వైఎస్సార్ జయంత్యుత్సవం
- పండగను తలపించిన వేడుకలు
- మహానేత విగ్రహాలు, చిత్రపటాలకు పుష్పాంజలి
- అమలాపురంలో పాల్గొన్న ఎంపీ బోస్, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ
- కొత్తపేటలో నివాళులర్పించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి
- హాజరైన మాజీ ఎమ్మెల్యేలు, కో ఆర్డినేటర్లు, కార్యకర్తలు

సాక్షి, అమలాపురం: సంక్షేమ ప్రదాత, అభివృద్ధి దార్శనికుడు, పేదల హృదయాలను గెలిచిన నాయకుడు, రైతు పక్షపాతి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని మంగళవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పండగలా ఈ కార్యక్రమం జరిగింది. దివంగత మహానేతకు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. ఆ మహనీయుని పేరు మీద సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు వస్త్ర దానం, రోగులకు పాలు, పండ్ల వితరణ జరిపారు.

- కొత్తపేట నియోజకవర్గం పరిధిలో పలుచోట్ల వైఎస్సార్ జయంతిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మంటపంలో 14 మంది రైతులను సత్కరించారు. వారి సమక్షంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అమలాపురం పార్లమెంటరీ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రమైన అమలాపురం నియోజకవర్గంలో పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి జరిగింది. అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, శాసనమండలి సభ్యులు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, శ్రీకాంత్ పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో శ్రీకాంత్‌తో పాటు పలువురు నాయకులు రక్తదానం చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచి పెట్టారు. ఆసుపత్రి వద్ద పేదలకు వస్త్ర దానం చేశారు. స్థానిక హరి మనో వికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.
- పి.గన్నవరం నియోజకవర్గం పరిధిలోని పి.గన్నవరం మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పాల్గొన్నారు. స్థానిక సీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. మామిడికుదురు, అయినవిల్లి మండలాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు జరిగాయి. విలస లెప్రసీ ఆస్పత్రి వద్ద రోగులకు పండ్లు, దుప్పట్లను పంపిణీ చేశారు.
- రామచంద్రపురం నియోజకవర్గ పరిధిలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో రామచంద్రపురం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి, మున్సిపల్ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ సమక్షంలో పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సూర్యప్రకాష్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు.
- రాజోలు నియోజకవర్గంలో పార్టీ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంత్యుత్సవం ఘనంగా జరిగింది. తాటిపాక, మామిడికుదురు, మలికిపురం, శివకోడు, నగరం, సఖినేటిపల్లిలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- మండపేట నియోజకవర్గం పరిధిలోని మండపేట పట్టణం, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో వైఎస్సార్ జయంతిని వేడుకలా జరిపారు. ఎమ్మెల్సీ, నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు పాల్గొని దివంగత నేతకు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ కార్యాలయంలో అన్నదానం, సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు.
- ముమ్మిడివరం నియోకవర్గం పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు జరిగాయి. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పార్టీకి చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, పార్టీ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్



ముమ్మిడివరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్

విద్యతో పాటు వ్యాయామం అవసరం

- రాజ్యసభ సభ్యుడు బోస్
- అమలాపురం జెడ్పీ బాలుర హైస్కూల్లో క్రీడా పరికరాల ప్రారంభం



క్రీడా పరికరాలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బోస్, చిత్రంలో జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, డాక్టర్ శ్రీకాంత్ తదితరులు

అమలాపురం టౌన్: ప్రతి విద్యార్థి చదువుతో పాటు వ్యాయామంపై శ్రద్ధ చూపేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో రూ.30 లక్షలతో అమర్చిన పలు క్రీడా పరికరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులు చదువులోనూ ప్రతిభ చూపగలరన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అభ్యర్థన మేరకు తన ఎంపీ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయించి, క్రీడా పరికారాలను సమకూర్చిన ఎంపీ బోస్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ప్రత్యేకంగా అభినందించారు. ఆ పాఠశాల క్రీడా స్థలంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన సభకు ఎంపీ బోస్, జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అతిథులుగా హాజరయ్యారు. జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు రోజూ వ్యాయామం అలవాటు చేయాలని వ్యాయామ ఉపాధ్యాయులకు సూచించారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ అమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా స్థలం ప్రాధాన్యతపై అవగాహన ఉన్న ఎంపీ బోస్ రూ.30 లక్షలతో క్రీడా పరికరాలను సమకూర్చడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎంపీ బోస్ క్రీడాభిరుచితోనే క్రీడా పరికరాలను ఏర్పాటు చేశారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి రామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, మాజీ కౌన్సిలర్ బండారు సత్యనారాయణ, వెటరన్ క్రీడాకారులు మెహబూబ్ సిస్టర్స్ సహీరా, షకీలా, వ్యాయామ ఉపాధ్యాయులు ఆకుల ఉమామహేశ్వరరావు, కుడుపూడి బుజ్జి పాల్గొన్నారు.

ఉచిత బస్సు ఏది చంద్రబాబూ?

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి వినూత్న నిరసన
- క్యూఆర్ కోడ్‌పై ప్రయాణికులకు అవగాహన



రావులపాలెం బస్టాండ్‌లో నినాదాలు చేస్తున్న చిర్ల జగ్గిరెడ్డి, సూర్యారావు



మడికి వెళ్లే బస్సులో క్యూఆర్ కోడ్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జగ్గిరెడ్డి, విజయలక్ష్మి

రావులపాలెం: సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉన్న ఉచిత బస్సు ఏది? అంటూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. పార్టీ శ్రేణులతో కలసి మంగళవారం ఆయన రావులపాలెం డిపోలో బస్సు ఎక్కారు. ఆయన వెంట అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఉన్నారు. అక్కడి నుంచి జాతీయ రహదారి మీదుగా మడికి వరకూ ప్రయాణం చేశారు. మార్గం మధ్యలో జొన్నాడ సెంటర్ వద్ద రాజోలు ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కూడా బస్సు ఎక్కారు. బస్సులో ప్రయాణికులకు ఉచిత బస్సు హామీ అమలుపై బాబు చేస్తున్న మోసాన్ని వివరించారు. ఉచిత బస్సు లేదంటూ నినాదాలు చేశారు. అనంతరం మడికిలో దిగి అక్కడి నుంచి వేరే బస్సులో తిరిగి రావులపాలెం చేరుకున్నారు. ఈ సందర్భంగా బస్సులో ప్రయాణికులకు రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు సిరిపురపు శ్రీనివాసరావు, కొత్తపేట ఐటీ విభాగం అధ్యక్షుడు కొవ్వూరు సుధాకర్ రెడ్డి, కర్రి నాగిరెడ్డి తదితరులు ఉన్నారు.

మన బడి.. మన బాధ్యత

- రేపు పాఠశాలల్లో మెగా పీటీఎం 2.0
- ఏర్పాట్లను పూర్తి చేసిన విద్యాశాఖ

రాయవరం: మన బడి.. మన చిన్నారుల భవిష్యత్తును నిర్దేశిస్తుంది. చిన్నారుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల కృషితో పాటుగా తల్లిదండ్రుల బాధ్యత కూడా ముఖ్యం. దీనిలో భాగంగా గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ డే నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దీనికి మెగా పీటీఎం 2.0గా నామకరణం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,150 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరగనుంది. దీనిలో భాగంగా గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల ఫలితాలతో కూడిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థుల తల్లిదండ్రులకు అందించనున్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ అధికంగా వినియోగించడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తారు. సైబర్ నేరాలపై మహిళా పోలీసులు అవగాహన కల్పిస్తారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. వారితో పాటు తల్లులకు రంగవల్లులు పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తారు. ఈ సమావేశాలకు సంబంధించిన 30 సెకన్ల వీడియో, మూడు ఫొటోలను లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 1,561 పాఠశాలలకు సమగ్ర శిక్షా ద్వారా రూ.1.65 కోట్లు విడుదల చేశారు. ఆ నిధుల నుంచి 20 శాతం మెగా పేటీఎం నిర్వహణకు వెచ్చించాలని సమగ్ర శిక్షా ఎస్‌పీడీ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ఏర్పాట్లు చేశామని సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్ జి.మమ్మీ తెలిపారు.

తల్లిదండ్రులు హాజరు కావాలి



తమ చిన్నారుల విద్యా ప్రగతిని తెలుసుకునేందుకు, పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు తల్లిదండ్రులు మెగా పీటీఎంకు హాజరవ్వాలి. ఈ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సమావేశాలను సమర్థంగా నిర్వహించేందుకు అవసరమైన ఆదేశాలను డీవైఈవో, ఎంఈవోలకు అందజేశాం.

– డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

ఆస్పత్రికి వెళుతూ మృత్యు ఒడికి..

- బైక్ ను ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్
- భార్య మృతి
- భర్త, పిల్లలకు గాయాలు



పటవల వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఝాన్సీలక్ష్మి, గాయపడిన శేఖర్

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని పటవల జంక్షన్ వద్ద మంగళవారం ఆయిల్ ట్యాంకర్ ఢీకొని దడాల ఝాన్సీలక్ష్మి (28) మృతి చెందింది. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు ఇంజరం గ్రామానికి చెందిన దడాల శేఖర్ తన భార్య ఝాన్సీలక్ష్మి, ఇద్దరు కుమారులను తీసుకుని కాకినాడ ఆస్పత్రికి వెళుతుండగా ఆయిల్ ట్యాంకర్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఝాన్సీలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, శేఖర్, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. పటవల గ్రామ పంచాయతీ మహిళా పోలీసు కోరంగి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య మృతదేహం వద్ద శేఖర్ బోరున విలపించడం అక్కడివారిని కలచివేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

10 నుంచి పొగాకు విత్తనాల విక్రయం



డాక్టర్ మాగంటి శేషుమాధవ్, నిర్కా డైరెక్టర్

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్-నిర్కా) (పూర్వపు సీటీఆర్ఐ)లో 2025–26 సీజన్‌కు ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నాణ్యమైన వర్జీనియా పొగాకు విత్తనాలు విక్రయించనున్నారు. వీటిని ఎస్‌బీఎస్, ఎస్‌ఎల్ఎస్, ఎన్‌బీఎస్, ఎన్ఎల్ఎస్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిర్కా డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ మంగళవారం ప్రకటనలో కోరారు. అలాగే 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కందుకూరులోని వాణిజ్య వ్యవసాయ పరిశోధనాసంస్థ (పూర్వపు సీటీఆర్ఐ)లో కూడా పొగాకు విత్తనాల విక్రయాలు ప్రారంభమవుతాయన్నారు. జీబీఆర్ఎస్ పాస్‌బుక్ ఉన్న రైతులకు ప్రతి బ్యారన్‌కు 500 గ్రాముల చొప్పున కిలో రూ.1,300కు విక్రయిస్తారన్నారు. కావాల్సిన రైతులు బ్యారన్ రిజిస్ట్రేషన్ పాస్‌బుక్ తప్పని సరిగా తీసుకురావాలన్నారు. క్యాష్‌లెస్ లావాదేవీలు అనగా యూపీఐ (గూగుల్ పే, ఫోన్ పే), క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా మాత్రమే అనుమతి ఉందన్నారు. పొగాకు బోర్డు ద్వారా రిజిస్టర్ చేయించిన కమర్షియల్ నారుమడులకు సంబంధించిన రైతులకు కిలో విత్తనాలను రూ.2,200కు విక్రయిస్తారన్నారు.

రక్కసీ కోత

- కరిగిపోతున్న ఉప్పాడ తీరం
- సముద్రంలో కలసిపోతున్న భూములు
- రక్షణ చర్యలు చేపట్టని ప్రభుత్వం
- నెరవేరని పవన్ కల్యాణ్ హామీ

పిఠాపురం: ఉప్పాడ తీరంలో సముద్రం తరచూ ఉగ్రరూపం దాల్చుతుంటుంది. తుపాను రానప్పటికీ, ఉపద్రవాల హెచ్చరికలు లేనప్పటికీ సముద్ర కెరటాలు ఒక్కసారిగా ఉప్పొంగుతుంటాయి. దీంతో తీరం వెంబడి భూమి మీటర్ల మేర కోతకు గురవుతోంది. ఉప్పాడతో పాటు దాని శివారు గ్రామాలు కడలిలో కలిసి పోతుంటాయి. ఇలా సుమారు శతాబ్ద కాలంగా కడలి కబలించేస్తున్నా శాశ్వత రక్షణ చర్యలు మాత్రం కనిపించడం లేదు. ఇక్కడ ఉన్నవి గుడిసెలే కదా అని రూ.లక్షల్లో ఉన్న ప్రతిపాదనలను పట్టించుకోక పోవడం వల్ల వందల ఎకరాల పంట భూములు, పురాతన ఆలయాలు, భవంతులు కడలి గర్భంలో కలిసిపోయాయి. కాకినాడ – విశాఖ మధ్య పారిశ్రామికాభివృద్ధికి మూలస్తంభంలాంటి బీచ్ రోడ్డు నిర్మించిన నాటి నుంచే కడలి పాలవుతూనే ఉంది.

గ్రామాలు	కోతకు గురైన భూమి (ఎకరాల్లో)
ఉప్పాడ	84.51
రమణక్కపేట	13.01
అమరవిల్లి	133.50
సుబ్బంపేట	141.30
కోనపాపపేట	233.56
మూలపేట	359.78
కొమరగిరి	362.83
మొత్తం	1,360



ఉప్పాడ గ్రామంపైకి విరుచుకుపడుతున్న సముద్ర కెరటాలు



ఉప్పాడ తీరంలో పంట పొలాల్లోకి చొచ్చుకు వచ్చిన సముద్రం నీరు

ఉప్పాడ రక్షణకు చర్యలు ఉత్తిమాటేనా?

కోతకు గురవుతున్న ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు రూ.వందల కోట్లతో చర్యలు తీసుకుంటున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయం మరిచిపోయారు. గత ఏడాది ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన రక్షణ చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనితో తీర ప్రాంత రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో గత ఏడాది జూలై 24న కలెక్టర్ ఆధ్వర్యంలో డీఎఫ్ఓ భరణి, నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ (ఎన్‌సీసీఆర్) జాయింట్ సెక్రటరీ రమణ మూర్తి జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉప్పాడ నుంచి కాకినాడ పోర్టు వరకు తీర ప్రాంతం అభివృద్ధి, ఉప్పాడ తీరం కోత, ఇతర ప్రాంతాల్లో సముద్ర కోత నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చలు జరిపారు. ఇవన్నీ జరిగి ఏడాది పూర్తవుతున్నా కనీసం ప్రణాళికలు కూడా తయారు కాలేదు.

పెరిగిన కోత

గత కొన్ని నెలలుగా ఉప్పాడ తీర ప్రాంతం తీవ్ర కోతకు గురవుతోంది. ప్రకృతి వైపరీత్యాలతో సంబంధం లేకుండా నిత్యం కోత బారిన పడుతోంది. ఇప్పటి వరకు రక్షణగా ఉన్న జియోట్యూబ్ టెక్నాలజీ రక్షణ గోడ పూర్తిగా కడలిలో కలిసి పోగా, పక్కనే ఉన్న పంట పొలాలు సైతం సముద్రంలో మునిగిపోతున్నాయి. ఇలా ఇప్పటి వరకు 1,360 ఎకరాల పంట భూమి కోతకు గురై కడలి గర్భంలో కలిసి పోయింది. ఈ తీర ప్రాంత రక్షణకు రూ.250 కోట్లతో ప్రణాళికలు అన్న మాట కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్‌సీసీఆర్ అధ్యయనం ప్రకారం కోస్తా తీరంలో ఉప్పాడ కొత్తపల్లి, సఖినేటిపల్లి మండలాలు ప్రమాద స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. 1956 నుంచి ఇప్పటి వరకు ఒక్క ఉప్పాడ గ్రామంలోనే సుమారు 85 ఎకరాల భూమి సముద్రంలో కలిసిపోయినట్లు గుర్తించారు.

కోతకు కారణమేదే!

గోదావరి ఇసుక కొట్టుకు రావడం వల్ల కాకినాడ సమీపంలో ఏర్పడిన హోప్ ఐలాండ్ కారణంగానే ఉప్పాడ ప్రాంతం కోతకు గురవుతుందని నిపుణులు తేల్చి చెప్పారు. ఈ ఐలాండ్ సముద్రంలో 40 చదరపు మైళ్ల విస్తీర్ణం గల లోతు లేని అగాధం (కాకినాడ బే) సృష్టించడం వల్ల దీని సమీపంలోని ఉప్పాడకు ముప్పు ఉందని నిర్ధారించారు. ఉత్తరం వైపు నుంచి తెరుచుకుని ఉండే ఈ అగాధం దక్షిణ వైపు నుంచి తీరానికి వెళ్లే అలలను అడ్డుకుంటోంది. దీంతో అలలతో పాటు వెళ్లే పదార్థాలు (లిట్టోకల్ డ్రిప్ట) తీరం చేరడం లేదు. దానివల్ల అలల తాకిడితో హోప్ ఐలాండ్‌లో ఇసుక దిబ్బలు పెరుగుతుండగా, ఉప్పాడ తీరంలో ఇసుక మేటలు వేయడానికి బదులు తీరంలో మట్టి కోతకు గురవుతుంది.



ఉప్పాడ శివారు మాయాపట్నం వద్ద బీచ్ రోడ్డుకు రక్షణగా వేసిన జియో ట్యూబ్ రక్షణ గోడ (ఫైల్)



ప్రస్తుతం మాయాపట్నం వద్ద కడలిలో కలిసిపోయిన జియోట్యూబ్ రక్షణ గోడ

75 ఏళ్ల క్రితమే..

1950లోనే ఉప్పాడ తీరానికి సముద్ర కోత వల్ల ముప్పు ఉందని అధికారులు గుర్తించారు. రక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించక తప్పదని ఈ మేరకు సర్వే జరిపిన విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం తేల్చి చెప్పింది. 1971లో కోత తీవ్రతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 1992లో పూణేలోని అప్పటి పీడబ్ల్యూఆర్ఎస్ డైరెక్టర్ సీవీ గోలే అధ్యక్షతన ఒక సాంకేతిక సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఆ బృందం సాంకేతిక పరంగా సర్వేలు జరిపి ఉప్పాడ ప్రాంతం కోత.. విశేష స్వభావం కలిగినదిగా తెలిపింది.

పొంచిఉన్న ప్రమాదం

కాకినాడ – విశాఖ మధ్య పారిశ్రామికాభివృద్ధికి మూలస్తంభమైన ఉప్పాడ తీరం శాశ్వత రక్షణకు చర్యలు చేపట్టలేకపోతే, ప్రత్యామ్నాయం అయినా చూడాలి. ఉప్పాడ కోతకు అడ్డుకట్ట వేస్తానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ నెరవేరుతుందని ఆశించిన తీర ప్రాంత వాసులకు నిరాశ మిగిలింది. దీంతో గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోవాల్సిందే అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర కోత కారణంగా ఇప్పటి వరకూ సుమారు 32 వేల నివాస గృహాలు కడలిలో కలసిపోయినట్టు లెక్కలు చెబుతున్నాయి.

లైంగిక వేధింపులపై కేసు

దేవరపల్లి: నల్లజర్ల మండలం నబీపేటకు చెందిన మర్రి శోభన్‌బాబుపై నల్లజర్ల పోలీస్ స్టేషన్‌లో మంగళవారం లైంగిక వేధింపుల కేసు నమోదైంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నబీపేట గ్రామానికి చెందిన మహిళ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో శోభన్‌బాబు ఆమెపై అత్యాచారయత్నం చేశాడు. అతడి నుంచి విడిపించుకునే సమయంలో జరిగిన పెనుగులాటలో ఆ మహిళకు గాయాలయ్యాయి. దీంతో ఆమెను తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదుచేయగా శోభన్‌బాబుపై కేసు నమోదు చేశారు.

నూతన సేద్య పద్ధతులతో కోకోలో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి ముత్యాల నాయుడు

అంబాజీపేట: కోకో సాగులో నూతన సేద్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు అన్నారు. అంబాజీపేటలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో డైరెక్టర్ ఆఫ్ క్యాషినేట్ అండ్ కోకో డెవలప్‌మెంట్ ప్రోత్సాహంతో మంగళవారం కోకో సాగుపై శిక్షణ నిర్వహించారు. ముత్యాల నాయుడు మాట్లాడుతూ కోకో తోటల్లో యాజమాన్య పద్ధతులు అవలంబించాలన్నారు. కొమ్మ కత్తిరింపు, పురుగుల నియంత్రణ పద్ధతులపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకోను సాగు చేయడం వల్ల అదనపు రాబడి పొందవచ్చన్నారు. డాక్టర్ నామాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కోకో కాయ తయారయ్యే సమయంలో తోటలను రైతులు పరిశీలించి ఎలుకల బెడద ఉంటే నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. హార్టికల్చర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కోకో ప్రొడక్షన్, కోకో వాల్యూ అడిషన్, ప్రోసెసింగ్ విధానాలను వివరించారు. శాస్త్రవేత్తలు బి.నీరజ, ఎ.కిరీటి, వి.అనూష తదితరులు కోకోలో సూక్ష్మపోషకాల యాజమాన్య విధానాలను తెలిపారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక పత్రాలతో అభ్యర్థులు, చిత్రంలో ఆర్టీసీ అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: ఏపీఎస్ ఆర్టీసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పని చేస్తూ వివిధ సహజ మరణాలతో పాటు మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల పత్రాలను అందజేసినట్లు డీపీటీఓ వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో పది మందిని కండక్టర్ గ్రేడ్-2 ఉద్యోగం కోసం ఎంపిక చేసి, నియామక పత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు, కోనసీమ జిల్లా ప్రజా రవాణా అధికారి రాఘవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరేశ్వరా.. క్షమించవా..

- అభిషేకానికి ఉపయోగించే కొబ్బరి కాయలు పక్కదారి
- మురమళ్ల ఆలయంలో ఘటన
- అధికారుల నిర్లక్ష్యంపై భక్తుల ఆగ్రహం

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి కొబ్బరి కాయలతో అభిషేకం పూర్తిస్థాయిలో జరగడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో కొబ్బరికాయలు పక్కదారి పడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఆలయంలో ప్రతి రోజూ రాత్రి జరిగే కల్యాణాలకు సంబంధించి ఉదయం అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ అభిషేకానికి సంబంధించి ఒక టిక్కెట్టుకు రెండు కొబ్బరి కాయలు కేటాయిస్తారు. పండితులు వీటితో భక్తుల గోత్రనామాలతో స్వామికి, వినాయకునికి అభిషేకాలు చేస్తారు. ప్రతి నిత్యం సుమారు 116 కల్యాణాలు ఇక్కడ జరుగుతాయి. అంటే రోజుకు 232 కొబ్బరికాయలు కొట్టాలి. కానీ ఆలయంలో 15 రోజులకు సంబంధించి కేవలం ఒక్క రోజు మాత్రమే స్వామికి అభిషేకాల కొబ్బరి కాయలు కొట్టారు. మిగిలిన రోజులు స్వామికి ఎగనామం పెట్టేశారు. అభిషేకాలకు సంబంధించిన కొబ్బరి కాయలు ఎక్కడకు వెళ్లాయో తెలియదు.

భక్తుల ఆవేదన

స్వామివారి కల్యాణానికి రుసుము రూ.1,000 తీసుకుంటారు. భక్తుల నమ్మకాన్ని కొందరు అవినీతి పరులు సొమ్ము చేసుకొంటున్నారు. స్వామివారి అభిషేకానికి ఉపయోగించాల్సిన కొబ్బరి కాయలను పక్కదారి పట్టించి, వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారు. అనాదిగా వస్తున్న ఆచార, సంప్రదాయాలను, పూజాది కార్యక్రమాలు తుంగలోకి తొక్కేస్తున్నారు. కొబ్బరి ధర హెచ్చును సాగుగా చూపుతూ కొబ్బరి నీళ్ల అభిషేకానికి స్వస్తి పలికేశారు. దీనిపై ఆగ్రహించిన కొందరు భక్తులు నేరుగా ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. కొబ్బరి కాయల పాటదారునికి షోకాజ్ నోటీసులు ఇస్తామని ఆయన తప్పించుకొనే ప్రయత్నం చేశారు. అయితే అభిషేకాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో ఆలయ అధికారుల తీరుపై భక్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా.. ఆలయంలో ఎంతో పవిత్రంగా భావించే అన్నప్రసాదాలకు రుచి, శుచి కరువైయ్యిందనే భక్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై సహాయ కమిషనర్ వి.సత్యనారాయణను వివరణ కోరగా కొబ్బరి కాయలు ఇవ్వడం లేదని తన దృష్టికి వచ్చిందని, సంబంధిత పాటదారునికి నోటీసులు అందజేసి యథావిధిగా అభిషేకాలు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.



ఆలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కొబ్బరి కాయల తొట్టె



మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి

పశువైద్యాధికారి శ్రీనివాసు మృతి



అలమూరు: నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఏడీ నాన్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా చైర్మన్, పినపళ్ల గ్రామీణ పశు వైద్యాధికారి ఈదల శ్రీనివాసు (61) మంగళవారం మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ సమయంలో గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. గుమ్మిలేరు, చింతలూరు, మూలస్థాన అగ్రహారం, జొన్నాడ, పినపళ్ల గ్రామాల్లో ఆయన పశువైద్యాధికారిగా సేవలందించారు.

ముగ్గురు అవినీతి అధికారులకు జైలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఈ ఏడాదిలో ఇప్పటివరకూ ముగ్గురు అవినీతి అధికారులను ఏసీబీ పట్టుకుందని ఆ శాఖ రాజమహేంద్రవరం డీఎస్పీ ఎం.కిశోర్ కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మార్చి 24న పిఠాపురంలో రూ.20 వేలు లంచం అడిగిన కేసులో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.గుణశేఖర్, మార్చి 28న కాకినాడ రిజిస్ట్రార్ కె.ఆనందరావు, జూన్ 25న వీఆర్‌వో పరస శ్రీమన్నారాయణను అరెస్టు చేసి జైలుకి పంపామన్నారు. ఎవరైనా లంచం అడిగితే తనకు 94404 46160, రాజమహేంద్రవరం ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ భాస్కర్ 94404 46161, కాకినాడ జిల్లా ఇన్‌స్పెక్టర్ డి.వాసు 83329 71041, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌స్పెక్టర్ వై.సతీష్ 94404 46163లతో పాటు అవినీతి నిరోధకశాఖ రాజమహేంద్రవరం ల్యాండ్‌లైన్ నంబర్ 0883 2467833కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇసుక లారీ కింద పడి వ్యక్తి మృతి

ధవళేశ్వరం: ఇసుక లారీ కింద పడి ధవళేశ్వరం మసీదు వీధి కొండ మెరక ప్రాంతానికి చెందిన పువ్వల లక్ష్మణ్ (39) మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పువ్వల లక్ష్మణ్ పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో పని కోసం రాజమహేంద్రవరానికి మోటారు సైకిల్‌పై బయలుదేరాడు. ధవళేశ్వరం క్వాయర్ బోర్డు ఎదురుగా ఆటోను తప్పించే ప్రయత్నంలో రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో వెనుక వచ్చిన ఇసుక లారీ.. లక్ష్మణ్ కుడి కాలి పైనుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసును ధవళేశ్వరం సీఐ టి.గణేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బంగారు, వెండి ఆభరణాల చోరీ

ఆలమూరు: కాంట్రాక్ట్ అధ్యాపకురాలి ఇంట్లో బంగారం వెండి వస్తువులను దొంగలు చోరీ చేశారు. పెదపళ్ల గ్రామంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇవి. గ్రామానికి చెందిన నరసింహదేవర వెంకటదుర్గ అచ్యుత విశాలక్ష్మి పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఆమె ఈనెల నాలుగున తన కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి వెళ్లారు. అనంతరం ఈ నెల ఏడున తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా బీరువాలోని సుమారు రూ.8 లక్షల విలువైన 11 కాసుల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై జి.నగేష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

10 నుంచి బిక్కవోలు - అనపర్తి రైల్వే గేటు మూసివేత

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని బిక్కవోలు – అనపర్తి మధ్య ఉన్న 415 రైల్వే గేటు (605/9–11) ను ఈ నెల 10 నుంచి 13 వరకూ మూసివేయనున్నట్టు సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామ సుబ్బారావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. రైల్వే గేటులోని ప్రధాన ట్రాక్ మరమ్మతుల కోసం ఈ గేటు మీదుగా రాకపోకలు నిలిపివేస్తున్నామన్నారు. ఈ మేరకు అనపర్తి తహసీల్దార్, పోలీసు అధికారి, అనపర్తి, లక్ష్మీనారాయణపురం, కాపవరం పంచాయతీ అధికారులకు, లారీ, ఆటో యూనియన్ అసోసియేషన్లకు సమాచారం ఇచ్చామన్నారు. ఇటుగా రాకపోకలు సాగించే వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.


ఎస్‌బీఐ ఏటీఎం దగ్ధం

- పక్కనే ఉన్న బైక్‌లు, కారు సైతం అగ్నికి ఆహుతి
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం




దగ్ధమైన ఏటీఎం మెషీన్

యానాం: పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఏటీఎం కాలిపోయిన ఘటనలో సుమారు రూ.15 లక్షల ఆస్తినష్టం సంభవించింది. వివరాల్లోకి వెళితే.. కొత్త బస్టాండ్ సమీపంలోని పోలీస్ కార్వర్ట్స్ వెనుక ఉన్న కంచర్ల కాంప్లెక్స్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో మంగళవారం తెల్లవారుజామున మంటలు వ్యాపించాయి. అవి ఆ పక్కనే ఉన్న మల్లిపూడి శ్రీనివాసరావుకు చెందిన మోటార్ మెకానిక్ షాపునకు విస్తరించాయి. దీంతో అక్కడే రిపేర్‌కు వచ్చిన నాలుగు బైక్‌లు, ఒక కారు కాలిపోయాయి. పోలీస్ క్వార్టర్ ఆవరణలో ఇంటి వాకిలి తుడుస్తున్న ఓ మహిళ ఆ మంటలను చూసి అగ్నిమాపక దళ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జగడం మీరా సాహెబ్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాద స్థలాన్ని సీఐ అడలరసన్, ఎస్‌హెచ్‌ఓ-2 కట్టా సుబ్బరాజు, ఏఎస్సై పంపన మూర్తి, ఎస్‌బీఐ అధికార్లు పరిశీలించారు. ఏటీఎంలో నగదు ఎంత ఉందనేది ఇంకా తెలియలేదు. మెకానిక్ షాపు యజమాని మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో సుమారు రూ.15 లక్షల విలువైన బైక్‌లు, కారు కాలిపోయాయన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.



కాలిపోయిన బైక్‌లు



దగ్ధమైన కారు

ఈవోలదే సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అన్ని ఆలయాలలో సీసీ కెమెరాలు పని చేసేలా చూడాలని, అవి పనిచేయకపోతే ఈవోలే పూర్తి బాధ్యత వహించాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్‌వీ రమేష్‌బాబు అన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరిలోని దేవదాయశాఖ ఆలయాలు, సత్రాల ఈవోలతో మంగళవారం కాకినాడలోని బాలా త్రిపుర సుందరి ఆలయ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. రమేష్ బాబు మాట్లాడుతూ ఆలయాల్లో దేవుడి వెండి, బంగారం ఆభరణాలకు బీమా చేయించాలన్నారు. ఆలయాలు, సంస్థలకు సంబంధించి భూముల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా అన్యాక్రాంతమైతే సంబంధిత ఈవోలు వెంటనే నోటీసులు ఇచ్చి, వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో జ్యుయలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ విళ్ల పళ్లంరాజు, దేవదాయశాఖ ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ తహసీల్దార్ దాసరి భారతి, జిల్లా దేవదాయశాఖాధికారులు కె.నాగేశ్వరరావు, ఈవీ సుబ్బారావు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసు అధికారి



అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని పరిశీలిస్తున్న సీఐ సునీల్ కుమార్

కాకినాడ క్రైం: సాధారణ గస్తీలో భాగంగా కాకినాడలో భద్రతను పర్యవేక్షిస్తున్న కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్ సీఐ సునీల్ కుమార్ ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. సర్పవరంలోని విశాఖ డెయిరీ సమీపంలో మంగళవారం తెల్లవారుజాము 3.30 గంటల సమయంలో ఒక వ్యక్తి రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఆ సమయంలో వాహనాల రద్దీ లేకపోవడంతో అతడికి ఎలాంటి ప్రమాదం వాటిల్ల లేదు. గస్తీలో భాగంగా అటుగా వెళ్లిన సీఐ సునీల్ కుమార్ ఆ వ్యక్తిని చూశారు. వెంటనే మంచినీరు తాగించి, సపర్యలు చేసి కూర్చోబెట్టారు. నీరసంతో పడిపోయానని అతడు చెప్పడంతో పోలీసులు సురక్షిత ప్రాంతానికి చేర్చి, ఓఆర్ఎస్ ద్రావణాలు కొని ఇచ్చారు. కాగా.. రోడ్డుపై పడిఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడిన సునీల్ కుమార్‌ను ఎస్పీ బిందుమాధవ్, డీఎస్పీ దేవానంద్ పాటిల్ అభినందించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	23,000 – 23,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	26,500
గటగట (వెయ్యి)	25,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	25,500
గటగట (వెయ్యి)	24,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	19,000 – 20,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

మహిళను బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తి అరెస్టు

రంగంపేట: సోషల్ మీడియా ద్వారా మహిళను బ్లాక్ మెయిల్ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రంగంపేటకు చెందిన టేకుమూడి దుర్గకు తెలంగాణలోని జనగాం జిల్లా బచ్చన్నపేటకు చెందిన కొండా బాలకృష్ణతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. దీంతో అతడు దుర్గతో పాటు ఆమె కుటుంబ సభ్యుల ఫోటోలను మార్ఫింగ్ చేసి, వాటితో దుర్గను బెదిరించారు. ఫోన్ పే ద్వారా తన ఖాతాలోకి డబ్బులు కూడా వేయించుకున్నాడు. అయినా ఇంకా కావాలని డిమాండ్ చేస్తుండడంతో దుర్గ గత నెలలో రంగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి మంగళవారం బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీలో టెండర్లపై అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీకి సంబంధించిన 11 ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చే విధానంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించామని డీపీటీఓ వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. రాజమహేంద్రవరంలోని ట్రైనింగ్ కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ టెండర్ల ముందస్తు అవగాహన సదస్సుకు 21 మంది ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు హాజరయ్యారన్నారు.